ఇష్టారాజ్యంగా జంతువుల వధ

- పట్టణాల్లో జనావాసాలు, మురికి కాలువల పక్కనే వధిస్తున్న వైనం
- అయినా పట్టించుకోని బల్దియా సిబ్బంది, పాలకులు
- ప్రజల ప్రాణాలతో చెలగాటం

కామారెడ్డి టౌన్: జిల్లా వ్యాప్తంగా మాంసం విక్రయాలు జోరుగా సాగుతాయి. ఆదివారం సెలవు రోజున మాంసం ప్రియులు కొనుగోళ్లకు ఎక్కువ మొగ్గుచూపుతారు. జిల్లాలో నిత్యం మేకలు, గొర్రెలను వధిస్తూ క్వింటాళ్లలో మాంసం విక్రయాలు సాగిస్తున్నారు. నిబంధనల ప్రకారం పరిశుభ్రమైన చోట ఈ జంతువులను వధించాల్సింది పోయి రోడ్లు, జనావాసాలు, మురికి కాలువల పక్కన అపరిశుభ్రం వాతావరణంలో వధిస్తున్నారు. జిల్లాలో మూడు మున్సిపాలిటీలలో ఎక్కడా జంతు వధశాలలు లేవు. ఈ కారణంగా వ్యాపారులతో పాటు, ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

కనిపించని జంతువధశాలలు

నిబంధనల ప్రకారం మేకలు, గొర్రెలను జంతు వధశాల(కబేలా)లోనే వధించాలి. కానీ జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపాలిటీలలో ఎక్కడ కూడా జంతువధశాల ఏర్పాటుకు అధికారులు, పాలకులు కృషి చేయడం లేదు. దీంతో మాంసం విక్రయదారులు ఇష్టం వచ్చిన చోట గొర్రెలు, మేకలను వధిస్తున్నారు. రోడ్లపైనే జంతువుల రక్తాన్ని, కళేబరాలను పడేస్తున్నారు. దీంతో ఈగలు, దోమలు, జంతు కళేబరాలతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అపరిశుభ్రమైన చోట జంతువులను వధించడంతో మాంసంపై దోమలు, ఈగలు వాలుతున్నాయి. కామారెడ్డి మున్సిపల్‌లో సిరిసిల్లరోడ్‌లో డంపింగ్‌యార్డు వద్ద రూ.10 లక్షలు వెచ్చించి జంతువధశాల నిర్మించారు. అక్కడ డంపింగ్ చెత్త, దుర్గంధం, అపరిశుభ్రమైన వాతావరణం ఉండటంతో ఉన్నతాధికారులు అనుమతి నిరాకరించారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలో సుభాష్‌రోడ్, బతుకమ్మకుంట, బడాకసాబ్ గల్లీ, అశోక్‌నగర్‌కాలనీ, కొత్తబస్టాండ్, రామేశ్వరపల్లి, టేక్రియాల్, దేవునిపల్లి, సరంపల్లి తదితర ప్రాంతాలలో దుకాణాలు, జనవాసాల మధ్యే జంతువులను వధిస్తున్నారు. రోడ్లపైనే మాంసం విక్రయిస్తున్నారు. మిగతా మున్సిపాలిటీలలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. బల్దియా అధికారులు, పాలకులు ఇప్పటికైనా స్పందించి జంతు వధశాలలు నిర్మించాలని పురప్రజలు కోరుతున్నారు. అలాగే జీవాలు ఆరోగ్యమైనవేనా లేదా అని సంబంధిత అధికారులు ధ్రువీకరించాల్సిన అవసరం ఉందని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


జిల్లా కేంద్రంలో మురికి కాలువ పక్కనే మేకను వధిస్తున్న వ్యాపారి


రోడ్డు పక్కన అపరిశుభ్ర వాతావరణంలో మాంసం విక్రయం

ఏర్పాటుకు కృషి చేస్తాం



జిల్లా కేంద్రంలో జంతువధశాల ఏర్పాటు కోసం కౌన్సిల్‌లో చర్చిస్తాం. త్వరలోనే నిర్మాణానికి కృషి చేస్తాం. మాంసం వ్యాపారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తాం. వ్యాపా రులు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– గడ్డం ఇందుప్రియ, మున్సిపల్ చైర్‌పర్సన్, కామారెడ్డి

ఉద్యోగులపై చిన్నచూపు తగదు


మాట్లాడుతున్న అనిల్‌కుమార్

కామారెడ్డి అర్బన్: ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఐదు వాయిదాల కరువు భత్యం బకాయిలుండగా కేవలం ఒక వాయిదాను విడుదల చేయడం, 317 జీవోపై దాటవేత వైఖరి పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్నామని తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ అనిల్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఉద్యోగుల పట్ల చిన్నచూపు చూడటం తగదన్నారు. ఉద్యోగుల విషయానికి వచ్చేసరికి ఆర్థిక పరిస్థితి బాగాలేదని ప్రభుత్వం కుంటిసాకులు చెబుతోందని జిల్లా అధ్యక్షుడు వై.సత్యనారాయణ ఆరోపించారు. జిల్లా ప్రతినిధులు నాగభూషణం, టి.శ్రీనివాస్, లింగం, నళినీదేవి, సీహెచ్ లక్ష్మి, పబ్బ విజయశ్రీ, మీనా భూషణ్ తదితరులున్నారు.

క్రీడాకారులకు క్రికెట్ కిట్ అందజేత


క్రికెట్ కిట్‌తో బస్వాపూర్ క్రీడాకారులు

భిక్కనూరు: బస్వాపూర్‌లోని క్రీడాకారులకు వ్యాపారవేత్త పందిరి రాజిరెడ్డి రూ.35వేల విలువచేసే క్రికెట్ కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్వాపూర్ యువత క్రీడల్లో రాణించేందుకు అవసరమైన సహాయాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. క్రీడలు మానసిక ఆనందాన్ని కల్గిస్తాయని, యువత క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని సూచించారు.


ఖండెబల్లూర్‌లో టోర్నీ ప్రారంభిస్తున్న అరవింద్

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం ఖండెబల్లూర్‌లో ఆదివారం మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నియోజకవర్గ ఎస్సీ సెల్ చైర్మన్ సొదాగర్ అరవింద్ ప్రారంభించారు. ఖండెబల్లూర్ గ్రామ యువత ఆధ్వర్యంలో టోర్నీ నిర్వహిస్తున్నారు. మాజీ సర్పంచ్‌లు శివరాజ్‌దేశాయ్, సాయిలు, గ్రామ నాయకులు హన్మంత్‌రెడ్డి, రఫీ ఉన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


సదస్సులో మాట్లాడుతున్న అవిలయ్య

కామారెడ్డి అర్బన్: అంబేద్కర్, పూలే, సాహు మహరాజ్ లాంటి మహనీయుల ఆలోచనా విధానంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అవిలయ్య అన్నారు. ఆదివారం స్థానిక కామారెడ్డి ఫంక్షన్ హాల్‌లో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ అవగాహన సదస్సు జిల్లా అధ్యక్షుడు కె.గంగారాం అధ్యక్షతన జరిగింది. చట్టాలపై అవగాహన లేకపోవడం వల్ల బీసీలు అట్రాసిటీ లాంటి కేసుల్లో ఇరుక్కుపోతున్నారని బీసీ లెక్చరర్ల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ సుదర్శన్ నేత అన్నారు. అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల బాబు, బామ్‌సెఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బి.చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి నరేందర్, హైకోర్టు న్యాయవాది దేవరాజ్‌గౌడ్ తదితరులు మాట్లాడారు.

గడ్డి తొలగించారు .. మొక్కలు నాటారు

మాచారెడ్డి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం రోడ్డు డివైడర్‌పై పెరిగిన గడ్డిని తొలగించి ఆదివారం మొక్కలు నాటారు. మాచారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఘన్‌పూర్ స్టేజీ వరకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మించారు. డివైడర్‌పై మొక్కలు నాటారు కానీ నీళ్లు పోయకపోవడంతో అవి ఎండిపోయాయి. అప్పటి నుంచి వాటిని పట్టించుకునే నాథుడు కరువయ్యారు. ఇటీవల మండలంలో పర్యటించిన ఆయన దృష్టి డివైడర్‌పై పడింది. దీంతో డివైడర్‌పై పెరిగిన గడ్డిని తొలగించి కొత్తగా మొక్కలు నాటాలని ఎంపీడీవో గోపిబాబును ఆదేశించారు.



సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): బీజేపీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభారి నీలం చిన్న రాజన్న సూచించారు. ఆదివారం ఆయన లింగంపేటలో కార్యకర్తలతో మాట్లాడారు. ప్రధాని మోదీ మన్‌కీ బాత్ ప్రోగ్రామ్‌లో భాగంగా సభ్యత్వ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలన్నారు. కష్టపడిని వారికి గుర్తింపు ఉంటుందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్‌రావు, అసెంబ్లీ కన్వీనర్ లింగారావు, సిరిసిల్ల ఓబీసీ ఇన్‌చార్జి మహారాజుల మురళి, తదితరులు పాల్గొన్నారు.

నియామకం


గూగ్లోత్ వినోద్ కుమార్

రాజంపేట: మండలానికి చెందిన నడిమి తండా మాజీ సర్పంచ్ వినోద్ కుమార్‌కు లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బెల్లయ్య నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్, జాతీయ ప్రధాన కార్యదర్శి కోటియా నాయక్‌లు ఆదివారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను ఇచ్చినందుకు జాతి కోసం పాటు పడతానని తెలిపారు. త్వరలోనే జిల్లా, మండల కమిటీలు ఏర్పాటు చేసి జాతి ఐక్యతకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కామారెడ్డి అర్బన్: కాకతీయనగర్ 11 కేవీ ఫీడర్‌పై విద్యుత్ పురోగతి పనుల వల్ల ఈనెల సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆపరేషన్ ఏఈ ఎస్.వెంకటేష్ తెలిపారు. రాధాకృష్ణ లాడ్జ్ రోడ్డు, జన్మభూమి రోడ్డు, ఎన్జీవోస్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గుతుందన్నారు.

నేడు బీబీపేట, భిక్కనూరు బంద్

బీబీపేట/భిక్కనూరు: హిందూ దేవాలయాలు, విగ్రహాలపై జరుగుతున్న దాడులకు నిరసనగా నేడు బీబీపేట, భిక్కనూరు మండలాల బంద్‌కు పిలుపునిస్తున్నట్లు హిందూ ఐక్య వేదిక ప్రతినిధులు వేర్వేరుగా ఆదివారం తెలిపారు. బంద్‌కు వ్యాపార వాణిజ్య, విద్యా సంస్థలతో పాటు ప్రజలు సహకరించాలని వారు కోరారు. అంతే కాకుండా విగ్రహాలపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

తాడ్వాయిలో ప్రజావాణి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): స్థానిక తహసీల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రహిమొద్దీన్ తెలిపారు. ఈ ప్రజావాణి ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగుతుందని, ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరవుతారన్నారు. ఏమైనా సమస్య ఉంటే ఈ ప్రజావాణిలో ఫిర్యాదులు చేసుకోవాలని సూచించారు.

29న రక్తదాన శిబిరం

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 29న రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఎస్సై మహేష్ ఆదివారం తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ముత్యపు రాఘవులు ఫంక్షన్ హాల్‌లో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు, రక్తదానం చేసే వారు ముందుకు రావాలని ఆయన కోరారు.

మాలల ఆత్మగౌరవ సభకు తరలిన మాల మహానాడు నేతలు


బాన్సువాడ నుంచి వెళ్తున్న నేతలు

బాన్సువాడ/నిజాంసాగర్ : నాగర్ కర్నూల్‌లో ఆదివారం నిర్వహించిన మాలల ఆత్మగౌరవ సభకు బాన్సువాడ, నిజాంసాగర్ నుంచి మాల మహానాడు నేతలు తరలివెళ్లారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని కోరారు.

డిసెంబర్ 1, 2 తేదీల్లో మహాసభలు


మాట్లాడుతున్న కొంగల వెంకటి

కామారెడ్డి అర్బన్: డిసెంబర్ 1, 2 తేదీల్లో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం మూడో రాష్ట్ర విద్యా మహాసభలు కామారెడ్డి లక్ష్మీదేవి గార్డెన్‌లో నిర్వహించనున్నట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకటి అన్నారు. ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం స్థానిక కర్షక్ బీఎడ్ కళాశాలలో జరిగింది. సంఘ నిర్మాణంపై తాము దృష్టి పెట్టినట్టు, ఇందులో భాగంగానే కామారెడ్డిలో రాష్ట్ర విద్యా మహాసభలు నిర్వహించనున్నట్టు రాష్ట్ర అధ్యక్షుడు వెంకటి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుభాన్‌సింగ్, రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు చంద్రశేఖర్, దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

షుగర్ నిర్ధారణ శిబిరం



పిట్లం(జుక్కల్): లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో ఆదివారం ఉచిత షుగర్ నిర్ధారణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 9 మందికి ఉచితంగా షుగర్ పరీక్షలు నిర్వహించారు. షుగర్ నిర్ధారణ అయిన నలుగురికి డాక్టర్ రష్మిత కౌన్సిలింగ్ చేసి ఒక నెల సరిపడా మందులు ఉచితంగా అందజేశారు. లయన్స్ క్లబ్ కార్యదర్శి వేణుగోపాల్, కార్యదర్శి బాలు, ఆస్పత్రి డైరెక్టర్లు సుభాకర్, దయానంద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కామారెడ్డి –ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో ఆదివారం పోలీసుల ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. లైసెన్స్‌లు, పొల్యూషన్, వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో పాటు సీటు బెల్టులు, హెల్మెట్లు ధరించని వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలను నడిపినట్లయితే కేసులు నమోదు చేసి కోర్టుకు పంపిస్తామని తెలిపారు. చిన్న పిల్లలకు వాహనాలను ఇవ్వవద్దని, ఇచ్చిన వారు, నడిపించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

తాడ్వాయిలో..

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డిలో భిక్కనూరు ఎస్సై సాయికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలను నడుపుతున్న 12 మందిపై, సరైన ధ్రువపత్రాలు లేని 52 మందిపై కేసులు, నంబరు ప్లేట్‌లు లేని 14 వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్సై వివరించారు.

చేప పిల్లల పంపిణీ ఆలస్యంతో మత్స్యకారులకు ఇబ్బందులు

భిక్కనూరు: చేప పిల్లల పంపిణీని ఆలస్యంగా చేపట్టడంతో మత్స్యకారులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందని మత్స్య సహకార సంఘం జిల్లా మాజీ డైరెక్టర్ దాసరి నాగరాజు అన్నారు. ఆదివారం ఆయన భిక్కనూరులో మాట్లాడుతూ.. చెరువు, కుంటల్లో ఇప్పటికే నీటి మట్టం చాలా తగ్గిపోయిందని ఈ సమయంలో చేపపిల్లలను అందులో వదిలితే అవి సరిగా పెరగవన్నారు. దీంతో మత్స్యకారులకు ఆర్థికంగా ఇబ్బంది కలుగుతుందన్నారు.

మాజీ ఎమ్మెల్యే సురేందర్‌ను విడుదల చేయాలి

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌ను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో కేటీఆర్‌ను కలిసేందుకు వెళ్లిన సురేందర్‌ను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి మియాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించడం సరికాదని అన్నారు. వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఆదిమూలం సతీష్ హెచ్చరించారు.

పండ్ల పంపిణీ



కామారెడ్డి అర్బన్: సేవా వారోత్సవాల సందర్భంగా సేవా భారతి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి, వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవా భారతి జిల్లా అధ్యక్షుడు ఎం.బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. సేవా భారతి ద్వారా ఉచిత వైద్య సహాయం, విద్య, వృత్తి శిక్షణ, సామాజిక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. నగర అధ్యక్షుడు మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

జంగమ సంఘం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



ఎల్లారెడ్డి: జంగమ సంఘానికి ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులను కేటాయించాలని జంగమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విశ్వేశ్వరయ్య అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డిలో నిర్వహించిన జంగమ సంఘం నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంచార జాతుల వారికి కల్పిస్తున్న రిజర్వేషన్లు కల్పించాలని, జంగమ సమాజానికి ప్రత్యేకంగా శ్మశానవాటికకు స్థలాన్ని కేటాయించాలని కోరారు.

పేరుకుపోతున్న ధాన్యం రాశులు


భవానిపేట కొనుగోలు కేంద్రంలో ఆరబెట్టిన ధాన్యం రాశులు

- 60 శాతం నూర్పిళ్లు పూర్తి
- అయినా కొనుగోళ్లు ప్రారంభించని ప్రభుత్వం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం రాశులు పేరుకుపోయాయి. పంట నూర్పిళ్లు చేసి 20 రోజులు కావస్తున్నా నేటికీ ధాన్యం తూకం వేయడం లేదు. దీంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాసులు పేరుకుపోయి రైతులు అవస్థలు పడుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించడానికి చోటు లేక రోడ్లు, ఖాళీ స్థలాల్లో ధాన్యం ఆరబెట్టుకుంటున్నారు. దీంతో ఖర్చులు పెరిగిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తొందరగా ధాన్యం తూ కం వేయాలని రైతులు మొరపెట్టుకుంటున్నారు. ఖరీఫ్ సీజన్ పంటలు ఇప్పటికే నూర్పిళ్లు 60 శాతం పూర్తయ్యాయి. మరో 15 రోజుల్లో వరి కోతలు పూర్తి కావచ్చు.. అయినా నేటికీ తూకం వేసి రైస్ మిల్లులకు తరలించకపోవడంతో రైతుల్లో ఆందోళన రోజురోజుకూ పెరిగిపోతుంది. ఇప్పటికే వందలాది మంది రైతులు ప్రైవేటు వ్యాపారులకు ధాన్యం విక్రయించారు. ప్రభుత్వం రూ.2,330 మద్దతు ధర ఇస్తామని ప్రకటించినా తూకం ప్రారంభం కాకపోవడంతో ప్రైవేటు వ్యాపారులకు రూ.2,200 అమ్మి మోసపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు మిల్లర్ల సమస్యను పరిష్కరించి తూకం ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

దారి వదిలితే ప్రమాదాలు జరిగే అవకాశం


సబ్ కలెక్టర్‌కు వివరిస్తున్న స్థానికులు

బాన్సువాడ: బీర్కూర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించే డివైడర్ గురించి బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయికి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. రోడ్డు విస్తరణలో భాగంగా మండల కేంద్రంలో నిర్మించే డివైడర్‌ను పాత పోస్టాఫీసు వద్ద వాహనాలు వెళ్లేందుకు దారి వదులుతున్నారని, అక్కడ దారి కోసం డివైడర్ పనులను నిలిపివేయవద్దని, డివైడర్‌ను కమాన్ నుంచి కామప్ప చౌరస్తా వరకు పూర్తిగా నిర్మించాలని సూచించారు. పోస్టాఫీసు వద్ద దారి కోసం వదిలేస్తే ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని గ్రామస్తులు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పనులను పరిశీలిస్తానని సబ్ కలెక్టర్ అన్నారు.

పేదల పక్షపాతి షబ్బీర్ అలీ


చెక్కులు పంపిణీ చేస్తున్న చంద్రకాంత్ రెడ్డి

భిక్కనూరు: నిరుపేదలకు అండగా ఉండి సేవలు అందించే ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ పేదల పక్షపాతిగా పేరొందారని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం భిక్కనూరు మండల కేంద్రంలో ర్యాగట్లపల్లి గ్రామానికి చెందిన నాగన్నగారి మధుసూధన్‌రెడ్డి, రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన మధుసూధన్‌రెడ్డిలకు ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన అందజేసి మాట్లాడారు. షబ్బీర్‌అలీ అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజలకు అందుబాటులో ఉండి వారికి సేవలు అందించడంలో ముందుంటారన్నారు. పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీంరెడ్డి, మాజీ ఎంపీపీ గాలిరెడ్డి, నేతలు వినోద్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, మద్దురి రవి, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా భూలక్ష్మి బోనాల పండుగ



బాన్సువాడ: పంటలు సంవృద్ధిగా పండాలని ప్రతి ఏడాది పంటలు చేతికొచ్చే సమయంలో నిర్వహించే భూలక్ష్మి బోనాల పండుగ ఆదివారం బాన్సువాడలో ఘనంగా నిర్వహించారు. పాత బాన్సువాడ చావిడి నుంచి మహిళలు బోనాలతో ర్యాలీగా వచ్చి భూలక్ష్మీమాతకు సమర్పించారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌లు భూలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ భూలక్ష్మి అమ్మవారు ప్రజలందరిని సంతోషంగా ఉంచాలని కోరారు. ముదిరాజ్, గంగపుత్ర, గాండ్ల తేలికుల, యాదవ, మున్నురుకాపు, పద్మశాలి సంఘాల ఆధ్వర్యంలో మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో ర్యాలీ నిర్వహించారు. కౌన్సిలర్ గడుమల లింగం, నాయకులు కనుకుట్ల రాజు తదితరులున్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మాల్తుమ్మెదలో ఆదివారం వేంకటేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు దిగంబరశర్మ ఆధ్వర్యంలో రవికుమార్‌శర్మ దంపతుల సమక్షంలో స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. దేవతామూర్తుల విగ్రహాలకు అభిషేకాలు చేశారు.

కిటకిటలాడిన లక్ష్మీనర్సింహస్వామి ఆలయం



మాచారెడ్డి: చుక్కాపూర్‌లోని శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. పలువురు భక్తులు వాహన పూజలు, పుట్టు వెంట్రుకలు, స్వామివారికి ప్రత్యేక అర్చనలు చేయించారు. ఆలయ ఈవో శ్రీధర్, అర్చకులు నరసింహచార్యులు, శ్రీనివాసచార్యులు, పరంధామచార్యులు, సంజీవచార్యులు పాల్గొన్నారు.

గ్రామ దేవతల ఏర్పాటుకు భూమి పూజ



రామారెడ్డి: పోసానిపేటలో గ్రామదేవతలను ప్రతిష్ఠించేందుకు ఐదు గుళ్ల నిర్మాణం కోసం ఆదివారం భూమి పూజ చేశారు. గ్రామ దేవతలు గ్రామానికి రక్షగా నిలుస్తారని ఐదేళ్లకొసారి పండగ చేయడం గ్రామాలలో ఆనవాయితీగా వస్తుంది. మాజీ ఎంపీపీ నారెడ్డి దశరథ్ రెడ్డి గ్రామ మాజీ సర్పంచ్ గీరెడ్డి మహేందర్ రెడ్డి, గీరెడ్డి శంకర్ రెడ్డి, శివారెడ్డి, వీడీసీ అధ్యక్షుడు శనిగం సాయిలు, ఆలయ నూతన నిర్మాణ కమిటీ అధ్యక్షుడు గంగ్ర నర్సింలు పాల్గొన్నారు.

శబరిమలకు పాదయాత్ర

బాన్సువాడ: బీర్కూర్‌కు చెందిన ఐదుగురు అయ్యప్ప స్వాములు కేరళలోని శబరిమలకు ఆదివారం పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. మండల కేంద్రానికి చెందిన సుధాకర్‌యాదవ్ గురుస్వామి ఆధ్వర్యంలో బయలుదేరి వెళ్లారు. గురుస్వామి గుడికొండ లింగం తదితరులు ఉన్నారు.